క్లుప్తంగా

నాణ్యత పాటించాలి



పెదపట్నంలో రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పెదపట్నంలో జరుగుతున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట పి.గన్నవరం జీసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు తదితరులు ఉన్నారు.

ఘనంగా పాళ్లమ్మ జాతర



పాళ్లమ్మ అమ్మవారు

మామిడికుదురు: కొమరాడ గ్రామంలో వేంచేసిన పాళ్లమ్మ అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మేళ తాళాలతో, తీన్‌మార్ వాయిద్యాలతో, గరగ నృత్యాలతో, బాణసంచాతో కన్నులపండువగా జరిపారు. అంతకు ముందు అమ్మవారి పూజ ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. 14న అమ్మవారి ప్రాంగణంలో తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర మహోత్సవం ఈ నెల 16 వరకు జరుగుతుందన్నారు.

తైక్వాండోలో మౌనిక ప్రతిభ

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో నందంపూడికి చెందిన మందా మౌనిక ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించినట్లు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. అంబాజీపేట క్రీడాప్రాంగణంలో మౌనికను పలువురు సోమవారం అభినందించారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు విశాఖపట్నం యలమంచిలి వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో 40వ న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో సబ్ జూనియర్స్ అండ్ క్యాడెట్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు జరిగాయన్నారు. అండర్ 22 కేజీల విభాగంలో మౌనిక ప్రతిభ కనబర్చడంతో ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. మౌనికను పలువురు క్రీడాకారులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

సుబ్రహ్మణ్యం మృతి తీరని లోటు



సుబ్రహ్మణ్యం మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చప్పిడి సుబ్రహ్మణ్యం మృతి తీరని లోటని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం సుబ్రహ్మణ్యం మృతి చెందడంతో జగ్గిరెడ్డి పార్టీ నాయకులతో కలసి వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. జగ్గిరెడ్డి వెంట జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న వివేకానంద సభ్యులు

రావులపాలెం: వివిధ కారణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి తమ సభ్యులు రక్తదానం చేసినట్టు స్వామి వివేకానంద యోగా ఆశ్రమం గురువు శ్రీనివాస్ సోమవారం తెలిపారు. చొప్పెల్ల ఇటుకబట్టీలో జీవనోపాధి పొందుతున్న శ్రీకాకుళానికి చెందిన సరళ మల్లన్న, గేదెల్లంకకు చెందిన మట్ట సునీత, ముక్తేశ్వరానికి చెందిన మానేపల్లి దుర్గ అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరికి రక్తం అవసరం కావడంతో యోగా ఆశ్రమ సభ్యులు ఎ.సురేష్, కె.శేఖర్, సలాది బుజ్జి, గుత్తుల సురేష్, నల్ల ప్రవీణ్‌లు యోగా గురువు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు.

ఎమ్మెల్యే అభినందనలు

మలికిపురం: నాటు, నాటు అనే ప్రసిద్ధ పాటకు ఉత్తమ ఒరిజినల్ సాంగ్‌గా ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డు గెలుచుకోవడంపై ఆర్ఆర్ఆర్ చిత్ర బృందానికి సోమవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అభినందనలు తెలిపారు. ఇందులో స్వరకర్త కీరవాణి, గీత రచయిత చంద్రబోస్, జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్, దర్శకుడు రాజమౌళిలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

నులిపురుగును నిర్మూలిద్దాం

- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన వైద్యారోగ్యశాఖ
- నేడు డీ వార్మింగ్ డే



పెదపళ్లలో డీ వార్మింగ్‌డే నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారి

అలమూరు: దేశంలోని చిన్నారులు, కౌమారదశ పిల్లల ఆరోగ్యాన్ని తీవ్రంగా నష్టపరిచే పరాన్నజీవి పేగు నులి పురుగులుగా పిలువబడే సాయిల్ ట్రాన్స్ మీటెడ్ హెల్మింత్స్ (ఎస్‌టీహెచ్) పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ 2015లో ఎన్‌డీడీని ప్రవేశపెట్టింది. అందులో భాగంగా ఏటా ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో రెండు విడతలుగా జాతీయ డీ వార్మింగ్‌డే (ఎన్‌డీడీ) నిర్వహిస్తుంది. ఈ ఏడాది అనివార్య కారణాల వల్ల ఫిబ్రవరి 10న నిర్వహించవలసిన ఎన్‌డీడీని మార్చి 14న నిర్వహించేందుకు జిల్లా వైద్యారోగ్యశాఖ నిర్ణయించింది. దీంతో కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 11 మండలాల్లోని 179 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8,884 మంది విద్యార్థులకు, 711 అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం తీసుకుంటున్న 9826 చిన్నారులకు నులిపురుగును నిర్మూలించే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఒక సంవత్సరం చిన్నారి నుంచి 19 యేళ్ల కౌమారదశ పిల్లల వరకూ వైద్యారోగ్య సిబ్బంది ఈ మాత్రలను అందిస్తారు. మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లోని రెండేళ్ల చిన్నారులకు అర మాత్ర, మూడేళ్లు దాటిన వారితో పూర్తి మాత్రను మింగిస్తారు. ఆరోగ్య రక్షణకు సంబంధించిన చర్యలు తీసుకోకపోవడం పొరపాటున ఒక్కసారి శరీరంలోకి ప్రవేశించిన నులిపురుగులు రోజూ వేలాది గుడ్లు పెట్టి ఆరోగ్యానికి హాని కలిగిస్తాయి. ఫలితంగా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుంది.

వాడడం ఎలా ..

ఆరోగ్య సిబ్బంది ఇచ్చే 400 ఎంజీ ఆల్బెండజోల్ మాత్రను అవగాహనతో మింగాలి. రెండేళ్ల లోపు చిన్నారులకు సగం మాత్రను నీటిలో కరిగించి పట్టించాలి. ఆపై బడిన వారు పూర్తి మాత్రను నమిలి మింగాలి. మాత్రను పరగడుపున వేసుకుంటే కడుపులో తిప్పడం, వాంతులు అయ్యే అవకాశం ఉంది. ఆహారం తీసుకున్న తర్వాతే ఈ మాత్ర మింగాలి.

అంబాజీపేటలో..

అంబాజీపేట: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించే నులిపురుగు మాత్రల పంపిణీ పూర్తిస్థాయిలో విజయవంతమయ్యే చర్యలు తీసుకున్నామని వైద్యాధికారులు వి.గౌతమి, ఎ.ఇంద్రావతి, గీతాంజలి అన్నారు. అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందికి నులిపురుల మాత్రల పంపిణీపై సోమవారం పలు సూచనలు చేశారు. ఇప్పటికే అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశామన్నారు.

మాత్రలను మింగించడం తప్పనిసరి



శరీరానికి తీవ్ర హాని కలిగించే నులిపురుగుల నివారణకు ఏటా రెండు విడతలు ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలి. దీనివల్ల శరీరంలో సంభవించే దుష్పరిణామాలు పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

– పి.భవానీశంకర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, పెదపళ్ల

ఎన్‌డీడీని సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారుల నుంచి కౌమారదశ పిల్లల ఆరోగ్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌డీడీని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి. తల్లిదండ్రులు ఎల్లప్పుడు తమ పిల్లలకు ఆరోగ్యసూత్రాలపై అవగాహన పెంచాలి.

– పి.వెంకటరత్నం, సీహెచ్‌ఓ పెదపళ్ల

ప్రైవేటు విద్యాసంస్థల్లో సీట్లు కేటాయించాలి

అలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా హక్కు చట్టం అనుసరించి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం సీట్లు కేటాయించాలని ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యలో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత

సఖినేటిపల్లి: గ్రామానికి చెందిన దివ్యాంగుడు మేడిద కమలాకర్‌రావుకి సోమవారం మలికిపురం మండలం మేడిచర్లపాలేనికి చెందిన సత్తిబాబు యువత ట్రై సైకిల్ పంపిణీ చేసింది. మండల జనసేన పార్టీ అధ్యక్షుడు మల్లిపూడి సత్తిబాబు పుట్టినరోజు సందర్భంగా వారు ఈ కార్యక్రమం చేశారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

అలమూరు: గ్రామానికి చెందిన ముద్రగడ అరుణకుమారి వైద్యం నిమిత్తం వైఎస్సార్ సీపీ నేత రావాడ సత్తిబాబు సోమవారం రూ.పది వేల ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ నేలపూడి లావణ్య, కార్యదర్శి కె.సంజీవ్‌రెడ్డి, నాతికుమార్‌రాజా, వి.విజయ్ పాల్గొన్నారు.

ఆదర్శంగా నిలిచిన మొల్ల



మాచవరంలో మొల్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలుగు పదాలతో రచించారని, కాలక్రమేణా ఆ రామాయణం మొల్ల రామాయణంగా పేరుగాంచి ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు అన్నారు. అంబాజీపేట శివారు కుమ్మరిపాలెంలో సీతారామ శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మొల్లమాంబ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె రచనలను విదేశీ రచయితలు సైతం ప్రశంసించారు. తొలుత మొల్ల చిత్రపటం వద్ద పలువురు పూలమాల వేసి ఘన నివాళులర్పించి కేకు కట్ చేశారు. కార్యక్రమంలో మానేపల్లి వీరబ్రహ్మం, ఆదుర్తి నారాయణమూర్తి, ఉందుర్తి నాగబాబు, చిరతపూడి హేమలత, ర్యాలి శ్రీనివాస్ వడయార్, ర్యాలి భద్రకిరన్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



వక్కలంకలో వంట సామగ్రిని అందిస్తున్న దాత, గ్రామస్తులు

అంబాజీపేట: పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి అన్నారు. వక్కలంకలో వాసంశెట్టి విజయభాస్కరరావు సమకూర్చిన రూ.11 వేలు విలువైన వంట సామగ్రిని సర్పంచ్ రేవతి, పార్టీ నాయకుడు వాసంశెట్టి పెదబాబుల ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలకు సోమవారం అందజేశారు. మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట సామగ్రి, మిక్సీని పీఎంసీ చైర్మన్ నాగాబత్తుల రాజేష్, హెచ్‌ఎం పాము శ్రీనులకు అందించారు. అనంతరం దాత విజయభాస్కరరావును, సర్పంచ్ రేవతి–పెదబాబు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జనిపల్లి ఏడుకొండలు, పినిపే మోహన్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, యల్లమిల్లి జయబాబు, చిట్టూరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మానేపల్లిలో కంటి పరీక్షలు



మానేపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

పి.గన్నవరం: మానేపల్లిలో సర్పంచ్ పితాని చంద్రకళ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ గ్లూకోమ వారోత్సవాలు నిర్వహించారు. నాగుల్లంక పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుబ్బరాజు, పి.గన్నవరం సీహెచ్‌సీ ఆఫ్తాల్మిక్ అధికారి వి.వీరభద్రరావులు 50 మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్ కంటి వెలుగు స్క్రీనింగ్ కార్యక్రమం జరిగింది. వైద్యులు మాట్లాడుతూ 40 ఏళ్లు పైడిన వారు ఏటా గ్లూకోమా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బీవీవీఎస్ఎన్ మూర్తి, ఆరోగ్య కార్యకర్త పీసీహెచ్ లక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు పితాని నర్సింహారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పందనకు అర్జీలు



కొత్తపేట స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కిశోర్‌బాబు

కొత్తపేట: డివిజన్ కేంద్రం కొత్తపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన స్పందనకు తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు, ఆర్డీవో కార్యాలయం ఏఓ పీవీవీజేఎస్ కుమార్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ స్పందనకు రెండు అర్జీలు వచ్చాయి. వివిధ ప్రభుత్వ శాఖల సబ్ డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఎంఈఓ ఎం.హరిప్రసాద్, సీడీపీఓ పి.శారద, ఎంఎస్ఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు ఒకే అర్జీ వచ్చినట్లు ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, తహసీల్దార్ టి.మంగతాయారు తెలిపారు. అంబాజీపేటలో స్థల వివాదానికి సంబంధించి ఒక దరఖాస్తు వచ్చిందన్నారు. స్పందనలో మండలంలోని అధికారులంతా పాల్గొన్నారు.

అలమూరు: మండలంలోని చొప్పెల్లలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కారమైంది. దీంతో బాధితుడు యర్రంశెట్టి యేసుదాసు కలెక్టర్ కార్యాలయానికి సోమవారం వెళ్లి ఇండోర్ మొక్కను బహూకరించి కృతజ్ఞతలు తెలిపాడు. వివరాల్లోకి వెళితే స్థానిక పీహెచ్‌సీ పక్క వీధిలో కొంతమంది చెత్త పారబోసి డంపింగ్‌యార్డులా తయారు చేశారు. దీనిపై గత వారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హిమాన్షుశుక్లాకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అధికారులు సత్వరమే స్పందించి ఆ వీధిలో చెత్తను తొలగించి సంపూర్ణ పారిశుధ్యాన్ని నెలకొల్పారు.

పారిశుధ్యంపై అధికారులు దృష్టి సారించాలి



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆత్రేయపురంలో పర్యటించి పలువురిని పరామర్శించి ఆర్థిక సాయం అందించి, పారిశుధ్యం పనులను పరిశీలించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆత్రేయపురం గ్రామానికి చెందిన యార్లగడ్డ నాగేశ్వరరావు, మందపల్లి సత్యవతి, యార్లగడ్డ కిరణ్, చిర్రా కృపానందం, యార్లగడ్డ పెంటయ్యను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యం పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. దీంతో స్పందించిన అధికారులు ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దారు అనిల్‌కుమార్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీధర్‌తో పాటు అధికారులు స్పందించి ఆత్రేయపురంలో పారిశుధ్య పనులపై దృష్టి సారించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ముదునూరి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్ని విధాలా అభివృద్ధి

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- నరేంద్రపురంలో గడప గడపకూ..



నరేంద్రపురంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నరేంద్రపురంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులు జల్లి శ్రీను, రాయుడు చిన్న, నేలపూడి సత్యనారాయణ, గుత్తుల త్రిమూర్తులు, సత్యనారాయణ తదితరులతో కలసి ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగన్ పాలనలో చేకూరిన లబ్ధిని కుటుంబాల వారీగా వివరించారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న జగన్‌పై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. చంద్రబాబు, ఆయన తోక పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. సర్పంచ్ బి.వెంకమాంబ, నాయకులు కొంబత్తుల శేఖర్, ఇళ్ల నాగేశ్వరరావు, కోట నాగేంద్ర ప్రసాద్, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో రోడ్డు నిర్మించాలి

పి.గన్నవరం మండలం నరేంద్రపురంలో రూ.5 లక్షలతో నిర్మిస్తున్న చినపాలెం, పెదపాలెం రోడ్డు పనులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సోమవారం పరిశీలించారు. నాణ్యతతో రోడ్డు నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆయన ఆదేశించారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి రూ.3 లక్షల సాయం



కొత్తపేటలో యూటీఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఐవీ తదితరులు

కొత్తపేట: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కుటుంబ సంక్షేమ పథకం (యూటీఎఫ్ ఎఫ్‌డబ్ల్యు స్కీమ్) ఉపాధ్యాయ కుటుంబాలకు ఓ వరమని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు (ఐవీ) అన్నారు. యూటీఎఫ్ మండల శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి కుడుపూడి రామాంజనేయులు ఈ నెల ఒకటిన మృతి చెందారు. ఆయన సంతాప సభ, యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం సాయం పంపిణీ కార్యక్రమం సోమవారం సాయంత్రం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో నిర్వహించారు. ఈ సభకు మండల శాఖ అధ్యక్షుడు కేపీసీహెచ్ సూర్యారావు అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ ఐవీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. యూటీఎఫ్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుటుంబ సంక్షేమ పథకం జిల్లా డైరెక్టర్ బోర్డు సభ్యుడిగా రామాంజనేయులు ఎంతో నిబద్ధతతో పనిచేశారన్నారు. పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ రామాంజనేయులు సంఘానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం రామాంజనేయులు కుటుంబ సభ్యులకు రూ.3 లక్షల చెక్కును ఎమ్మెల్సీ ఐవీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, ఎఫ్‌డబ్ల్యు స్కీమ్ జిల్లా కార్యదర్శి ఎస్.విశ్వనాథ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, కోశాధికారి కె.సురేష్ కుమార్, కార్యదర్శులు వై.మురళి, జీవీ రమణ, వై.బాలాజీ, సీహెచ్ కేశవరావు, రాష్ట్ర కౌన్సిలర్లు టి.విజయకృష్ణ, కేవీఎస్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక కొత్తపూల ఉత్సవాలు



చింతలూరులో కొత్తపూల ఉత్సవంలో అలరించిన గరగ నృత్యాలు

అలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. నాలుగో విడత కొత్తపూలు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక అమ్మవారి ఆలయంలో మన్యసీమ నుంచి తీసుకువచ్చిన మోదుగుపూలను పెద్దగరగకు అలంకరించి ఆదివారం రాత్రి ఆరో విడత ఉత్సవాలను నిర్వహించారు. చర్మవాయిద్యాల దరువుకు అనుగుణంగా ఆలయ ఆసాదుల బృంద సభ్యులు గరగలను నెత్తిన ధరించి చేసిన గరగ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారుల చేసిన గరగ నృత్యాలు భక్తులను అలరించాయి. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి కొత్తపూల ఉత్సవాలను తిలకించారు. పూల గరగకు పూలు, అగరవత్తులు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన శక్తివేషాలు, విచిత్ర వేషధారణ, కోయ నృత్యాలు తదితర వినోద కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. చల్ల గరగ రూపంలో ఉన్న అమ్మవారికి నిర్వహించిన గ్రామోత్సవం ద్వారా ఇంటింటికీ దర్శనమిచ్చింది. నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు దగ్గర పడటంతో వ్యాపారులు తీర్థంలో తమ దుకాణాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే విద్యుద్దీపాలంకరణ, చలువ పందిళ్ల ఏర్పాటు చురుగ్గా సాగుతుంది. ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు, ఈఓ ఉండవల్లి వీర్రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిత్యాన్నదానానికి రూ.21 వేల విరాళం



అప్పనపల్లిలో స్వామి చిత్రపటాన్ని దాతకు అందిస్తున్న ఆలయ చైర్మన్, ఈఓలు

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామంలో వేంచేసిన బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో నిర్వహించే అన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన గొడవర్తి శ్రీదేవి జ్ఞాపకార్థంగా వారి కుమారుడు గొవర్తి జగన్నాథ కుమార్, కస్తూరి దంపతులు, వారి కుమారులు కల్యాణ్‌రుత్విక్, హితేష్ సాత్విక్ రూ.21,116 సోమవారం విరాళంగా అందజేశారు. వైశాఖ శుద్ధ పంచమి రోజున అన్నదానం జరిపించుటకు శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళంగా అందించారని ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్ చెప్పారు. అనంతరం స్వామి చిత్రపటాన్ని, లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, కొమ్ముల సూరిబాబు, ఆలయ ఉప ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌ఖాదర్, డైరెక్టర్ షరీఫ్

మామిడికుదురు: అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ ఆస్తులను పరిరక్షించి సర్వే చేసి అప్పగించాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. మామిడికుదురులో వక్ఫ్ ఆస్తులపై సర్వే చేయాలని చైర్మన్ అబ్దుల్ ఖాదర్, డైరెక్టర్ ఎండీవై షరీఫ్ తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఖాదర్ మాట్లాడుతూ మండలంలో సుమారు 83 ఎకరాలు వక్ఫ్ ఆస్తులు ఉన్నాయని, వాటిలో సుమారు 60 ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయయన్నారు. అన్యాక్రాంతమైన ఆస్తులను పరిరక్షించి నిష్పక్షపాతంగా సర్వే చేసి వాటిని అప్పగించాలన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంకలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.21,430 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అంతర్వేది దేవస్థానంలో మెగా మెడికల్ క్యాంపు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలో సోమవారం కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా మెడికల్ క్యాంపును మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ప్రారంభించారు. స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు తాడి మోహన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ క్యాంపుకు ప్రముఖ పారిశ్రామికవేత్త జంపన సత్యనారాయణరాజు సహకారం అందజేశారు. క్యాంపులో గుండె, జనరల్, డెంటల్, పీడియాట్రిక్ తదితర విభాగాల్లో డాక్టర్లు సుమారు 200 మంది రోగులకు వైద్య సేవలందించారు. రోగులకు మందులను ఉచితంగా నిర్వాహకులు పంపిణీ చేశారు. ఎంపీపీ కేతా శ్రీనివాస్, ముప్పర్తి నాని, తాడి సత్యనారాయణ, పోతురాజు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.